ప్రతీకారం

యర్రగుంట్ల వరలక్ష్మీదేవి

భీమారావు హౌరాకు పోయే మెయిల్లో తెనాలి నుండి ప్రయాణం చేసి విశాఖపట్నంలో మధ్యాహ్నం సుమారు రెండు గంటలకు దిగేడు, చేతిలో చిన్న సూటుకేసుతో. స్టేషను బైటకు రాగానే నాలుగు ప్రక్కలా ఓ సారి చూసి రిక్షాలున్న స్థలానికి వచ్చేడు.

"అయ్యా! రిక్షా కావాలా?"

"చూడు – నేను ఏదైన లాడ్జికి పోవాలి. దగ్గరలో ఏవైన మధ్య తరగతి లాడ్జీలున్నాయా?"

"లేకేం – ముందు రిక్షా ఎక్కండి, నేను తీసుకు వెళ్తా".

రిక్షావాడు స్టేషనుకు రెండు ఫర్లాంగుల దూరంలో నున్న మురళి లాడ్జింగుకు భీమారావుని తీసుకుని వెళ్ళేడు.

"సింగల్ రూము కావాలి".

"చార్జి రోజుకు ఇరవై అయిదవుతుంది".

"ఫరవాలేదు – ఇవ్వండి".

"ఎన్నాళ్ళుంటారు?"

"ఒక్క రోజే".

"అయితే అడ్వాన్సు ఇరవై అయిదిచ్చి, ఈ పుస్తకంలో మీ వివరాలు రాసి సంతకం చేయండి", అని లాడ్జి మేనేజరు పుస్తకాన్నిచ్చేడు.

అందులో –"కె. కృష్ణమూర్తి, రామమందిరం వీధి, విజయవాడ, వృత్తి వ్యాపారం", అని రాసి సంతకం చేసేడు భీమరావు.

భీమరావు ఒడ్డు, పొడవు, నిటారుగ నడిచేరీతి, మెలిత్రిప్పిన ఆ మీసాన్ని చూసి ఏ మిలిటరీ వాడో అనుకున్నాడు మొదట ఆ లాడ్జి మేనేజరు. అందుకే భీమారావు పుస్తకంలో రాసిన వివరాలను ఆశ్చర్యంతో చూసి, కాస్త తలపై కెత్తి భీమారావుని పరికించి 'దానికేంలే– మిలిటరీ వాడిలా ఉన్న వాడు వ్యాపారం చెయ్యొచ్చుగా' అని సర్దుకున్నాడు. భీమారావిచ్చిన పాతిక రూపాయల్ని అందుకుని అతనికి రూమునంబరు చెప్పి, రూము తాళాన్నిచ్చేడు.

భీమారావు రిక్షా వాడికి డబ్బులిచ్చి పంపించేసి, తాళాన్ని తీసుకుని మేడపైకి పోయేడు. వెంట రూము బాయ్ అతడి సూటుకేసుని తీసుకుని వచ్చేడు. గదిలోకి వచ్చేక రూము బాయ్‌కి రెండు సీసాలు చల్లని బీరు తెమ్మని చెప్పి, అక్కడున్న మంచంపై వాలేడు విశ్రాంతికి.

ఆ కుర్రాడు పది నిముషాలలో బీరు సీసాలు తెచ్చి టేబిలు మీద పెట్టి వెళ్ళి పోయేడు. భీమారావు లేచి గది తలుపు గడియ వేసి తన పెట్టిలో నుండి మేక్ డవల్ విస్కీ సీసాను తీసి బీరుతో కలుపుకుని మెల్లగ త్రాగడం మొదలెట్టేడు ఏదో దీర్ఘంగ ఆలోచిస్తు.

మెల్ల మెల్లగ అతడి కళ్ళు మైకం వల్లనేమి, వృద్ధి చెందు తున్న క్రోధం వల్లనేమి ఎర్ర బడ జొచ్చేయి. తాపీగాలేచి పెట్టెలోంచి ఓ పెద్ద చాకును తీసి టేబిలు మీద పెట్టేడు. దానివైపే అదోలా చూస్తూ మరో అరగ్లాసు విస్కీ బీరు త్రాగి, ముందుకు వంగి ఆ చాకును విప్పేడు. ఆ కత్తి నాలుగు అంగుళాల పొడవు. అంగుళం వెడల్పులో వాడికొనదేరుంది.

భీమారావు ఆ కత్తిని బిగువుగ పట్టుకుని కోపంగ చూస్తూ – "లంజ కొడకా నారాయుడా! ఒకే పోటుతో నిన్ను చంపేస్తారా", అని ఆ కత్తిని టేబిలు మీద గుచ్చబోయి అంతలోనే నిగ్రహించుకుని, మెల్లగ ఆ కత్తిని అలాగే టేబిలు మీద పెట్టేసేడు. కిటికీ లోంచి వస్తున్న కాంతిలో ఆ కత్తి పదును మెరుస్తూంది.

ఆసరికి త్రాగడం పూర్తయింది. ఆ కత్తిని తీసి ప్రేమగ ప్రియురాలిని తాకినట్లు ఆ పదునును వేలితో మృదువుగ తాకి, ఏదో ఆలోచన మదిలో మెదిలి చిరునవ్వుతో "నీకు నా వేలిరక్తం కాదు, ఈ రాత్రి నారాయుడి గాది గుండెలోని రక్తంతో అభిషేకం చేస్తా", అని తాపీగా ఆ చాకును మడచి పెట్టేసేడు.

తరువాత మైకంతో మంచం మీద వాలేడు. నిద్ర వచ్చినట్లే ఉంది గాని రావడం లేదు. అలా ఇటు అటు కాస్సేపు దొర్లేడు. మెల్లగ గత కాల స్మృతులు అతడ్ని పెనవేసుకున్నాయి.

* * * * * * *

భీమారావు నివాసం తండ్రి నాటి నుండి తెనాలిలోనే. భీమారావు తండ్రి నరసింహులు బ్రతికి చెడ్డరైతు. నరసింహులు అతడి తండ్రి నుండి సంక్రమించిన పదెకరాల పంట భూమిని సాగు చేసుకుని బ్రతుకుతుండేవాడు. కాని తన కాలంలో తన చేతకాని తనం వల్ల కొంత, దైవానుకూలత లేక కొంత, తన త్రాగుడు జూదంకు కొంత అలా ఆ భూమిని క్రమేపీ అమ్ముకుని ఆఖరిదశలో తెనాలి చేరేడు, ఓ చిన్న ఇల్లు అమ్మకానికి వస్తే కొనుక్కొని.

భీమారావు బాల్యం నుండి బలిష్ఠుడే. పైగ చురుకైనవాడు, బ్రతక కల్గిన నేర్పుకల వాడు. ఇరవై యేళ్ళకే తెనాలి బస్సు స్టాండు వద్ద ఓ కిళ్ళీ బడ్డీ తెరచి ఆర్జించడం మొదలెట్టేడు. కాని కొన్నాళ్ళకు ఆ సంపాదన భీమారావుకి తృప్తిని కల్గించలేదు. ఆ సమయంలో ఓ మధ్య వయస్కుడు, దొంగతనంగ మద్యాన్ని అమ్మేవాడు తారసపడి రూపాయి సోడాలను అమ్మమని మంత్రోపదేశం చేసేడు. దొంగ బట్టీలలో తయారు చేసిన సారాని సోడా బుడ్లలో పట్టించి, రహస్యంగ కిళ్ళీ బడ్డీల ద్వారా సోడా రూపాయి చొప్పున అమ్మించి లాభం చేసుకోడం అతడి వ్యాపారం.

భీమారావు ఆ వ్యాపారాన్ని చేపట్టిం తరువాత అతడి ఆర్జన బాగానే పెరిగింది. భీమారావు సారాని సేవించడం మొదలెట్టేడు. ఆ మద్య పానం మొదట సరదాకి, తరువాత అలవాటుగా అటుపిమ్మట వ్యసనంగామారి భీమారావుని జలగలాపట్టుకుంది.

భీమారావుకి వయస్సు వచ్చేక, ఆ దగ్గరలో నున్న ఓ గ్రామం నుండి తెచ్చిన ఓ చక్కని చుక్కను ఇచ్చి అతడి తల్లి తండ్రులు వివాహం చేసేరు. పెండ్లి నాటికి ఆ పిల్ల ఇరవై యేళ్ళ వయస్సులో మంచి పొంకంగ నుండేది. భీమారావుకి భార్య మల్లమ్మంటే ఎంతో మక్కువ.

కాని ఆ మోజు ఎక్కువ కాలం నిలవలేదు. అతడికి మద్యం ఇచ్చిన మజా, మాధుర్యం భార్య ఇవ్వలేక పోతూందని అనిపించింది. సంవత్సరం కాపురం తరువాత శరీర తీటను తీర్చుకుందుకు భీమారావు ఆ చక్కని భార్యను బాగా త్రాగొచ్చి ఏదో నెపం పై కయ్యానికి కాలు దువ్వి కొట్టేవాడు. ఆ సంవత్సరమే తండ్రి నరసింహులు చనిపోయేడు. ఆ తల్లి జబ్బు మనిషైపోయింది. అప్పటికీ ముక్కుతు, మూలుగుతు ఇంట్లో ఏవో చిరుపనుల్ని చేస్తుండేది.

కొన్నాళ్ళ తరువాత ఓ ఉపద్రవ మొచ్చి పడింది. బస్సు స్టాండుని విస్తృత పరచే ఉద్దేశంతో మున్సిపాలిటీ వారు ఆ చుట్టూ ఉన్న కిళ్ళీ బడ్డీల్ని, ఏరుదుకాణాలను చాల మట్టుకు తొలగించేరు. వాటిలో భీమారావు బడ్డీ ఒకటి. చేసేదేమి లేక భీమారావు ఆ కిళ్ళీ బడ్డీని, దూరంగనున్న ఓ సినీమా హాలు దగ్గర అయిదు వందలు ఖర్చు చేసి ఓ పెద్ద రౌడీ సహాయంతో ఓ చిన్న స్థలాన్ని పొంది, అక్కడ నిలబెట్టేడు.

కాని ఆ చోట రూపాయి సోడాల అమ్మకం బాగసాగలేదు. రోజుకి ఎంతో కష్టంపైన, ఆదిన్ను రాత్రి ఆట ముందరే ఓ నాలుగైదు సోడాలు అమ్ముడయేవి. దాంతో ఆ దొంగ వ్యాపారులు ఆ సోడాలను భీమారావుకి సరఫరా చేయడం మానివేసేరు. అప్పటికీ ఎలాగో ఆ కిళ్ళీ బడ్డీ మీద వచ్చిన సంపాదనతో కాలం గడుపుకుంటు వచ్చేవాడు భీమారావు.

అట్టాంటి సమయంలో నారాయుడు వచ్చేడు అవనిగడ్డ గ్రామం నుండి. అతడు భీమారావు తల్లికి దూరపు బంధువు. తెనాలి రాగానే బస్సుస్టాండు వద్ద అతడికి తెల్సిన ఆ సామి ఒకడు టీ స్టాల్‌ని అమ్మేస్తే అది కొనుక్కొని వ్యాపారం మొదలెట్టేడు. భీమారావు తల్లి ఉనికిని తెల్సుకుని ఒక నాటి

ఉదయం వాళ్ళింటికి వచ్చేడు. ఆ మాటా ఈ మాటా అయినాక–

"పెద్దమ్మా! మరినీ ఆరోగ్యం బాగున్నట్టు లేదు, ఆసుపత్రికి వెళ్ళి చూపించుకో లేక పోయావు?" అడిగేడు నారాయుడు.

"వైద్యాలు వైదూర్యాలు మరి నా కెందుకురా? కాలం మూడుతుంది. ఇకపైకి పోవడానికి దారి చూసుకోడమే", అని వేదాంతం వెళ్ళబుచ్చింది.

"పెద్దమ్మా – డబ్బు ఖర్చుకు జంకుతున్నావా? ఫరవాలేదు, నేను ఆ సంగతి చూసుకుంటాలే. బతికి నన్నాళ్ళు బాధలేకుండా ఉండాలిగా నాతో రేపురా తీస్కెళతా", అని వత్తిడి చేసేడు నారాయుడు.

"అయితే భీమన్నా నీ వ్యాపార మెలాగుంది?" అని కుశల ప్రశ్నలు వేసేడు.

భీమారావు నిట్టూర్పు విడచేడు. "ఏదో తిండికి వీధిన పడనవుసరం లేదు ప్రస్తుతానికి"; అని నిరాశతో మాట్లాడేడు.

మరో నెల్లాళ్ళు గడిచేయి. వారానికి ఓ సారైన నారాయుడు వచ్చి పోతుండేవాడు భీమారావింటికి. వట్టి చేతులతో వచ్చేవాడుకాదు. ఒచ్చి నప్పుడల్లా ఏవో బన్ను రొట్టిలో, పకోడీలో, ఖారం బజ్జీలో తెచ్చేవాడు. ఆ రాత్రి భీమారావు ఆ బజ్జీలను, ఆ పకోడీలను నంజుకుని ఇంట్లో నున్న మిగతా సారాను త్రాగేవాడు.

మరో రెండు నెలలు గడిచేయి. నారాయుడు భీమారావుని అన్న అని, భీమారావు భార్యను ఒదిన అని పిలవనారంభించేడు. నారాయుడు మహా ఉంటే భీమారావు కన్న సంవత్సరం, సంవత్సరంనర చిన్న ఉంటాడు. భీమారావు భార్య మల్లమ్మ చనువుగ నారాయుడిని మరిదీ అని పిలచేది.

ఒకనాడు నారాయుడు ధైర్యం చేసి భీమారావుతో తన మనస్సులోని మాటలను చెప్పేసేడు–

"అన్నా! నన్ను తిట్టు కొట్టు కాని నేను నామనస్సులోని మాటను చెప్పక తప్పదు. మనిద్దరి పరిస్థితులు బాగవాలంటే అదే నాకు తోచిన మార్గం. నాకు టీ స్టాల్‌లో సహాయం చేసే వారు ఎవ్వరూ లేరు. గ్లాసులు, ప్లేట్లు కడగడానికి, టేబిలు తుడవడానికి ఓ కుర్రాణ్ని నెల జీతంకు పెట్టుకున్నానంతే. ఇటు పొయ్యి పని, అటు అందించే పని నేనొక్కణ్ణీ చేసుకో లేక పోతున్నా. పకోడీలు, బజ్జీలు మరొకళ్ళ దగ్గర కొని కొట్లోపెట్టుకుని టీ తో బాటు అమ్ముతున్న. వాటినే నేను నా కొట్లో తయారు చేసి అమ్మితే ఎంతో లాభం. పైగ కోడి గుడ్లు అమ్ముతున్నానా, వాటినే కొట్లో ఆమ్లెట్లుగ తయారు చేసి అమ్మితే నాల్గింతల లాభం వస్తుంది. ఒదిన రోజంత ఏపని లేకుండ ఇంట్లో కూర్చుంటుంది. అందుకే నీకు అభ్యంతరం లేకపోతే ఒదిన వచ్చినాకు టీ స్టాల్‌లో సహాయం చేస్తే నా కొచ్చిన లాభాలలో సగం నీకిస్తా. నేనేం పరాయివాడిని కాను. నీకు తోడబుట్టిన లాంటి వాడిని. తొందరొద్దు– నువ్వు, ఒదిన, పెద్దమ్మ బాగా ఆలోచించుకుని రేపు చెప్పండి", అని నారాయుడు మెల్లగ జారుకున్నాడు. నారాయుడికి భీమన్నంటే ఎంతో బెదురు.

ఇంట్లో ఆరోజంత తర్జన భర్జన అయేక భీమారావు తల్లి ఒత్తిడి చేసింది.

"చూడు భీముడూ– నారాయుడు పైవాడు కాడు. నా దగ్గర బంధువు. నీకు తమ్ముడి లాంటి వాడు. వాడు మన కుటుంబానికి చెందిన మనిషే. వాడితో వాడి ఒదిన పని చేయడం ఆక్షేపణగ ఏమీ ఉండదు. వాడిది చాల మంచి మనసు. ఆవిధంగ మనకు కొంత కలసి వస్తుంది. మరే సందేహాలు పెట్టు కోక ఒప్పుకో."

"మరి నువ్వే టంటావ్ మల్లీ?" అని భార్య నడిగేడు.

"మరినీఇష్టమే నా ఇష్టం. నువ్వదంటే నే యెల్లి మరినీ చేత తన్నులు తినలేను," అని తన భయాన్ని, భర్త మీదున్న తన గౌరవాన్ని వెళ్ళబుచ్చింది.

"సరే – మీ అందరికి ఇష్టమైతే నాకే నేటి? అలాగే కాని," అని భీమయ్య ఊకొట్టేడు.

అమరునాటి నుండి మల్లమ్మ ఇంత వంట చేసేసి



భర్త కిళ్ళీ కొట్టుకు పోయేక తను బస్సుస్టాండు దగ్గరున్న టీ స్టాల్‌కి పోయేది. ఆ టీస్టాల్‌లో పని చూసుకుని, కాస్త ఉడకేసి తను కాస్త తిని నారాయుడి కింత పెట్టి మధ్యాహ్నం ఒంటి గంటన్నర కొచ్చి మళ్ళీ నాలుగుకి వెళ్ళి రాత్రి ఎనిమిది గంటల కింటి కొచ్చేది.

ఈ విధంగా కొన్ని మాసాలు బాగానే గడిచేయి. ఒకనాడు భీమారావు కిళ్ళీ బడ్డీ కెదురుగ నున్న సినిమా హాలు వద్ద సినీ హీరో కృష్ణ ఫాన్సు, హీరో శోభనబాబు ఫాన్సు ఏదో ఘర్షణపడి, కలబడి కొట్టుకుని సినిమా హాలుని కొంత పాడు చేసి, చుట్టూ ఉన్న కిళ్ళీ బడ్డీలను, చిల్లరదుకాణాలను తగలబెట్టేరు. ఆ గొడవలో కాలి బూడిదైంది భీమారావు కిళ్ళీ బడ్డీ ఒకటి. భీమారావు ఆ కోపంలో నలుగుర్ని చావబాది, తను నాలుగు తన్నులు తిని కుంటు కుంటు కళ్ళ నీళ్ళతో ఇంటికి చేరేడు రాత్రి ఏడున్నరకు.

తన గోడును చెప్పుకుందుకు ఇంట్లో భార్యలేదు. టీ స్టాల్ కెళ్ళుంది. ఆ రాత్రి ఆ విచారంలో పీక మొయ్యా త్రాగి, కసితీరక రాత్రి ఇంటికి వచ్చిన పెళ్ళాంతో ఏదో కీచులాడి ఆమెను చావ మోదేడు. ఆ తరువాత రెండు రోజులకు గాని మల్లమ్మ లేవలేక పోయింది.

మల్లమ్మ చాల దుఃఖించింది- ఏ ఆదరణకు నోచుకోక పోయిన ఈ తన్నుల బాధొకటి. ఆమె శారీరీకంగ, మానసికంగ కృంగిపోజొచ్చింది.

అట్లాంటి సమయంలో మల్లమ్మకు మరిది నారాయుడి నుండి ఓదార్పు, ఆదరణ లభించేయి. నారాయుడు మంచివాడు, ఏ వ్యసనాలు లేనివాడు. మొదటి నుండి మల్లమ్మంటే వల్లమాలిన అభిమానం. ఆ అభిమానమే క్రమేపి ప్రేమగ మారి, ఆమె అందానికి ఆకర్షింప బడి ఆమెకు చేరువై పోయేడు.

మెల్లగ చేతుల్ని కలుపుకోడం, చాటు మాటుగ అక్కడో ముద్దు ఇక్కడో ముద్దు పెట్టుకోడం, ఎవ్వరు చూడకుంటే ఒకర్ని ఒకరు హత్తుకోడం చేస్తుండేవారు. కాని ఇంకా వ్యవహారాన్ని ముందుకు పోనివ్వ లేక పోయేరు. వారిరువురికి తెల్సు భీమారావు బలమైన రౌడీ అని ఈ చాటు ప్రేమ తెల్సిందంటే నరికి పోగులు పెడ్తాడని.

పరిస్థితులలా ఉంతగ, భీమారావు వ్యాపారం దెబ్బతిని చేసేదేమి లేక తెగించి మిలటరీలో చేరిపోయేడు. తల్లికి కోడలు బాధ్యత నప్ప జెప్పి మిలటరి ట్రయినింగుకు వెళ్ళి పోయేడు.

శిక్షణ పూర్తయి కాశ్మీరు సరిహద్దు రక్షణకు మిలటరి జవానుగ పంపబడ్డాడు భీమారావు. నెల నెలా ఇంటికి ఉత్తరాలు రాస్తుండే వాడు. ఇంటికి డబ్బు పంపుతుండేవాడు. భీమారావు కాశ్మీరులో నుండగ తల్లి చనిపోయింది. కాని సెలవు మంజూరు కాలేదు. రాలేక పోయేడు. నారాయుడే అతడి తల్లికి దహన సంస్కారం చేశాడు.

తల్లి పోయిన నాల్గు మాసాలకు సెలవు దొరకి ఇంటికి బయలు దేరేడు. ముందుగ వస్తున్నట్లు



ప్రతీకారం

భార్యకు వ్రాసేడు. ఆ ఉత్తరాన్ని అందుకోగానే మల్లమ్మ భయంతో వణికి పోయింది. నారాయుడి భీతి సరేసరి.

దానిక్కారణం లేకపోలేదు- భీమారావు మిలటరికి వెళ్ళిం తరువాత కొద్ది మాసాలకు అతడి తల్లి బాగా జబ్బుపడి మంచమెక్కింది. నారాయుడు రాత్రుళ్ళు పిల్లిలా ఇంటికి చేరి మల్లమ్మ ప్రక్కలో చేరేవాడు.

ఈ చర్య మొదట్లో అతి రహస్యంగ సాగిన తరువాత ఇరుగు పొరుగుకి చూచాయగ తెల్సిపోయింది ఆఖరికి ఆ చుట్టుప్రక్కలవాళ్లకు, భీమారావు స్నేహితులకు కూడ ఆ సంగతి వ్యాపించింది అనుమానం పరిణామంచెంది. పొగనుచిమ్మి రాజుకుని మంటగ లేచి ఆఖరుకు మల్లమ్మను, నారాయుడిని దహించే స్థితికి వచ్చింది. అప్పుడే భీమారావు ఇంటికి వస్తున్నట్లు వ్రాసిన ఉత్తరం పిడుగులా వచ్చిపడింది. ఆ ప్రేమికు లిద్దరు భయంతో బిగుసుకుపోయేరు.

భీమారావు తెనాలి చేరేసరికి తనింటికి పైన గడియపెట్టిఉంది గడియ తీసుకుని లోనికి వెళ్లేడు. ఇల్లు బోసిగ తోచింది. అర్థంకాక బస్సుస్టాండుకు వెళ్లేడు. అక్కడ టీస్టాల్‌లో కొత్త యజమాని ఎదురయ్యేడు.

"నారాయుడు వారం రోజుల క్రితం నాకీ టీ స్టాల్ అమ్మేసిపోయేడు. ఎక్కడకు పోయింది నాకు తెలియదు."

ఆసరికి భీమారావు మనస్సులో ఏదో అనుమానం జనించింది ఇంటికి తిరిగొచ్చి ప్రక్కింటావిడను పల్కరించే -

"పెద్దమ్మా! మల్లమ్మఏది?ఎక్కడ కెళ్ళిందేమిటి?" అని యథాలాపంగ అడిగేడు. ఆవిడ భీమారావుని ఇంట్లోకి తీసుకెళ్లి కూర్చొ బెట్టింది.

ఆవిడ భీమారావు రాకను అడిగి, క్షేమ సమాచారాలు కనుక్కొని అసలు కథను చెప్పేసింది-

"ఏం చెప్పను నాయనా- ఆ వగలాడి నిన్ను మోసం చేసి ఆ నాయుడితో లేచిపోయింది."

"ఆ!" భీమారావు తలమీద ఎవరో బలంగ [illegible] విగ్గాంతి [illegible] ఓ నిమిష మయితేగాని తేరుకోలేకపోయేడు.

ఆ పెద్దావిడే చెప్పుకుపోయింది-

"నువ్వు మిలటరికి పోయింతరువాత ఆ నారాయుడు నీ ఇంట్లోనే పక్క వేసేవాడు. ఒకటే సరసాలు; ఒకటే ముచ్చట్లు మీ అమ్మ జబ్బుతో మంచమెక్కిందా, వాళ్ల విరగబాటుకి మరి అడ్డే లేకపోయింది తరువాత మీ అమ్మ చచ్చిపోయేక ఇద్దరు మరింత బరితెగించేసేరు అందరికి క్రమేపి వాళ్ల రంకు వ్యవహారం తెల్సిపోయింది. కాని వాళ్లేమి జంకిపోలేదు హఠాత్తుగ అయిదు రోజుల క్రితం ఇద్దరు డబ్బు, ధైర్యం కూడదీసుకుని ఎక్కడికో లేచిపోయేరు ఇంటికి తాళమేనా వేయకుండా గడియపెట్టి ఎవ్వరికి తెలియనియ్యక రాత్రి ఏ ట్రయినుకో పోయేరు"

భీమారావు రక్తం క్రోధంతో అవమానంతో ఉడుకెత్తిపోయింది తనకు తెల్సిన వాళ్లందర్ని కలిసేడు కానిఎవ్వరు నారాయుడి గురించిగాని, మల్లమ్మ గురించిగాని వారెక్కడకు పోయిందీ చెప్పలేక పోయేరు భీమారావు అత్తవారి గ్రామం వెళ్లేడు వారెవ్వరికి మల్లమ్మ ఆచోకి ఏమీ తెలియదు నారాయుడి గ్రామంవెళ్లి వాకబు చేసేడు. వాడి జాడ వాళ్ళు చెప్పలేకపోయేరు.

ఆనాటి నుండి భీమారావు ధ్యేయ మొకటే - మల్లమ్మను, నారాయుడిని వెదక పట్టుకుని ఇద్దర్ని నరకి పారేయడమే అప్పటికి గాని తన హృదయంలో రగిలిన మంట చల్లారదు ఇది జరిగి ఆరేళ్ళు కావస్తుంది

భీమారావు తిరిగి మిలిటరిలోకి పోయేడు ప్రతి సంవత్సరం ఓ నెల్లాళ్ళు సెలవు మీద తెనాలి వచ్చి మల్లమ్మ గురించి, నారాయుడి గురించి తెల్సిన అందర్ని అడిగి వారి జాడను కనుక్కొందుకు ప్రయత్నించేవాడు అత్తవారి బంధువుల్ని, నారాయుడి స్నేహితుల్ని, బంధువుల్ని కలిసి వారెక్కడకు పోయింది తెల్సుకుందుకు ఎన్నో ప్రయత్నాలు చేసేడు. అలా ఆరేళ్ళు గడచి పోయేయి భీమారావు మరి పెండ్లి చేసుకోలేదు. అలాగని అటువాళ్ళ పొత్తును వదలు కోలేదు. బజారు [illegible] అవసరమైనప్పుడల్లా శారీరక వాంఛల్ని తీర్చుకునే వాడు. ఒంటరివాడు. [illegible] జేబులో ఆడుతుంటే, మరి [illegible]? తనకు అత్యంత ప్రియమైన మ[illegible] హానాన్ని మిక్కుటంగా[illegible]వాడు

ఇమారు సెలవు తీసుకుని ఇంటికి వచ్చిం తరువాత ఓ నాడు విజయవాడలో ఓ పరిచయస్తుడు ఎదురు పడి, ఏవో మాటల మీద – "భీమన్నా! నీ భార్య మల్లమ్మను చూచానోయ్", అని చెప్పేసేడు.

భీమారావు ఆత్రంగ అతడి భుజాన్ని పట్టుకుని– "ఎప్పుడు? ఎక్కడ?" అని అడిగేడు.

"ఈ మధ్యకాదులే. అయిదారు నెలలై యుంటుంది. నేను బస్సులో విజయనగరం నుండి విశాఖపట్నంకు మా బామ్మరిదింటికి వెళ్తుంటే చిట్టి వలస గ్రామం వద్ద నీ భార్య మల్లమ్మను బస్సు పక్కనే మరో కావిడతో మాట్లాడుతుంటే చూసేను. నేను బస్సులో కూర్చుని ఉన్నాను. మల్లమ్మ ఆవిడతో 'మాఆయన జ్యూటు మిల్లు నుండి వచ్చే టైమయింది. మరి వెళ్తానమ్మా' అని చేతిలోని కూరగాయల సంచితో కదిలింది. అప్పుడు చూచి పోల్చుకున్నాను మల్లమ్మేనని. నేను పిలిచేలోగా బస్సు కదలి పోయింది

భీమారావు ఆ సాయంత్రమే విజయవాడలో పొడుగాటి పదునైన చాకును కొన్నాడు. తరువాత తెనాలి తిరిగొచ్చిం తరువాత ఓరోజంత దీర్ఘంగ ఆలోచించి ఓ పథకం వేసుకుని-బయలు దేరేడు. తన సెలవు అయిపోయిందని, డ్యూటీలో చేరాలని తెల్సిన వాళ్ళందర్కి చెప్పి ట్రయినెక్కేడు.

* * * * *

భీమారావు ఆలోచనల నుండి నిద్రలోకి జారుకున్నాడు. తరువాత నిద్రనుండి మేల్కొని రిస్టు వాచి చూసుకుంటె సాయంత్రం అయిదు గంటలయింది. లేచి స్నానం చేసి బట్టలు వేసుకుని చాకుని పాంటు జేబులో పెట్టుకుని బయలు దేరేడు.

రిక్షా ఎక్కి బస్సుస్టాండుకు చేరేడు. అక్కడ వాకబు చేయగ విజయనగరంకు, శ్రీకాకుళంకు పోయే బస్సులన్ని చిట్టి వలస మీదుగ పోతాయని తెల్సి ఆరూటు బస్సు ఒకటి ఎక్కేడు. భీమారావు తన ప్రతీకార వాంఛ తీరుతున్నందుకు ఒక విధంగ ప్రశాంతంగానే ఉన్నాడు.

భీమారావు ప్లానంత చిట్టివలస రాత్రి చేరింతరువాత మెల్లగ నారాయుడు ఉంటున్న ఇంటిని కనుక్కొని ఆ ఇంటిలోకి ప్రవేశించి ముందు నారాయుడ్ని, తరువాత భయంతో బిక్క చచ్చి పోయున్న మల్లమ్మను పొడిచి చంపి, ఆ ఇంటి తలుపుల్ని వేసేసి తన జేబులో నున్న కొత్త తాళం కప్పను వేసెయ్యాలి తరువాత మెల్లగ విశాఖపట్నం వచ్చేసి ఆ తాళం చెవుల్ని ఏ కాలువలోనో పారేసి, ఆ రాత్రి లాడ్జిలో పడుక్కొని మరునాడు తెల్లవారు ఝామున బయలు దేరి జనతా ఎక్స్‌ప్రెస్‌లో కలకత్తాకు చేరి అక్కడ నుండి తను డ్యూటీ చేస్తున్న పంజాబుకు పోవలచేను

ఇంటికి తాళం వేసెయ్యడంవల్ల లోన ఏమైంది తెలిసే సరికి ఓరోజు పట్టొచ్చు. ఆసరికి తను సురక్షితంగ కలకత్తాకు చేరుకుంటాడు. ఇంత దూరం వచ్చేసి అజ్ఞాతంగ ఇక్కడ జ్యూటు మిల్లులో పని చేస్తున్న నారాయుడే ఆ అవని గడ్డ

ప్రతీకారం

గ్రామ వాసి నారాయుడని ఎవరికి తెలియగలదు? ఏ విధంగ తన ప్రమేయం తెల్సిరాదు. ఒక వేళ పోలీసులు తెలివిగ తనే ఆ హత్యలను చేసిన వ్యక్తని ఆరా తీసి పట్టుకుంటే పట్టుకోనీ తన ప్రతీకార వాంఛ తీరేక తనేమై పోయిన ఫరవాలేదు అంతకు తెగించే బయలు దేరేడు భీమారావు.

భీమారావు చిట్టి వలస చేరినప్పటికి రాత్రి ఏడు దాటింది. చిట్టివలస చిన్న గ్రామమైన అది లేబర్ ఏరియా గనుక, అందునా ఆంధ్రదేశంలోని గ్రామం గనుక తినుబండారాల దుకాణాల కన్న ఎక్కువగ బ్రాంది షాపులు, సారాయి దుకాణాలున్నాయి.

భీమారావు మొదట నాటు సారాతో పెరిగిన వాడైనా మిలిటరీలో చేరింతరువాత కంపెనీ విస్కీకి అలవాటు పడ్డ వాడయేడు. అందుకే కాలం గడపడానికి, మరి కాస్త ఒళ్ళు వేడెక్కించ డానికి ఓ బార్‌లోకి వెళ్ళేడు.

పెగ్గు పెగ్గుతో బాటు మనసులో రగిలున్న క్రోధాగ్ని మెల్లగ ప్రజ్వరిల్లడం మొదలైంది. సరిగ్గా ఎనిమిది గంటలకు బార్ నుండి బయటకు వచ్చేడు. మెల్లగ, గంభీరంగ అడుగులు వేసుకుంటు లేబర్ కాలనీ వైపుకు బయలు దేరేడు.

'ఈ జూట్ మిల్లులో నారాయుడనే అతడు పని చేస్తున్నాడు. అతడిల్లు మీకు తెల్సునా?" అని ఒక రిద్దర్ని భీమారావడిగేడు

"అరెండో వరుసలో చిట్ట చివరిల్లే" అని ఒకడు చెప్పగల్గేడు.

ఆ కాలనీలో దీపాలు మాంద్యంగ, మసకగ ఉన్నాయి. అదీ ఒకందుకు మంచికే అనుకున్నాడు భీమారావు. మెల్లగ జేబులో నున్న కత్తిని, తాళం



కప్పను తడిమి చూసుకున్నాడు. పుచ్చుకున్న విస్కీ మెదడుకు క్లైమాక్సుస్తుంటే హృదయంలో రగిలిన అవమాన జ్వాల అతడి పట్టుదలను సడలించక అకట్టుకునుంది.

ఆ ఇంటిని చేరేడు. ఆ ఇంటికి కాస్త దూరంలో దీపపు స్తంభముండడం వల్ల ఆ ఇంటి మీద కాంతి పడడంలేదు ముందు వరండా గది తలుపులు దగ్గరగా వేసున్నాయి. ఆ తలుపుల్ని మెల్లగ తీసి వరండాలోకి ప్రవేశించి, తలుపుల్ని మూసి చప్పుడు కానివ్వకుండ గడియ పెట్టేడు లోన గది తలుపుల్ని చేరేడు ఆ తలుపులు చేరుపగ మాత్రం వేసున్నాయి లోనుంచి మాటలు వినవస్తున్నాయి–

'మల్లమ్మా! నా మాట ఇనవే".

అనుమానం లేదు– అది నారాయుడి గొంతుకే! ఆ స్వరం వినేసరికి భీమారావు రక్తం ఉడుకెత్తి పోయింది. పాంటు జేబులోంచి చాకును తీసి తెరిచాడు. తలుపు సందులోంచి వస్తున్న సన్నని కాంతిలో ఆ కత్తి పదును అత్యాశతో మెరిసింది.

మెల్లగ తలుపుల్ని కాస్త తెరచి ఆ సందులోంచి భీమారావు లోనకు చూచేడు గదిలో పెద్దగ సామానేమి లేదు. గది మధ్యన పై నుంచి ఓ ఇరవై అయిదు వాట్ల బల్బు చిన్నగ వెలుగుతూంది. ఆ సన్నని వెలుగులో ఆగది లోని దృశ్యాన్ని చూసి భీమారా వాగిపోయేడు.

గదికి ఓ ప్రక్కన చాప మీద మల్లమ్మ పడుక్కొని ఉంది బాధతో మూలుగుతూంది. ఆమె ప్రక్కన కూర్చుని నారాయుడు గ్లాసులో నున్న మందును త్రాగమని యెంతో ఆదరంతో బ్రతిమాలుతున్నాడు.

"మల్లీ – నా మాటిను. ఈ మందు తాగు. నీజ్వరం తగ్గిపోతుంది. రేపు డాక్టరు బాబును కలసి కొత్త మందును తెస్తాలే".

ఏంటయ్యా – నన్ను బాధిస్తావు. ఈ మందుల వల్ల నాకేంకాదు. కాటికి దగ్గరపడినదానను. ఇన్ని నెలలై వదలని జబ్బు ఇప్పుడీ మందుతో పోతుందా – నీ వెర్రిగాని? మరినా గురించి డబ్బు తగలేయకు. ఇప్పటికే నా వైద్యానికి చాల అప్పులు చేసేవు. మరెందుకయ్యా ఈ ఖర్చు?" అని బాధతో మిళితమైన హీన స్వరంతో పల్కింది

భీమారావు శ్రద్ధగ చూచేడు మల్లమ్మను. తను ఎరిగున్న మల్లమ్మకు ఈ మల్లమ్మకు సామ్యమే లేదు. పచ్చగ, మంచి పొంకంగ నిగారింపుతో నుండే తన చక్కని భార్య మల్లమ్మ ఇప్పుడు మసి బారి, వ్యాధితో కృసించి ఎండు పుల్లలాఉంది. అలాంటి జీవత్శవంపై నారాయుడికింకా ప్రేమ చావక పోవడం భీమారావుకు అంతుబట్టని విషయమై అత్యం తాశ్చర్యాన్ని కల్గించింది.

"మల్లీ! అలాంటి మాటలనకే. ఎలాగైన నిన్ను బతికించుకుంటానే. నామాటినే. ఈమందుతాగే", అని కంట నీరు చిమ్మగ వ్యాకుల పడి పోయేడు నారాయుడు.

భీమారావు ఈ మారు నారాయుడిని గమనించేడు. నారాయుడూ చిక్కిపోయేడు కాని ఆ ముఖంలో కళ, ఆ సౌమ్యత తరగలేదు.

"నన్ను ఇలా చావనీయవయ్యా రోగిష్టి దానితో నీకేం సుఖం? మన వీధి చివర్నున్న రామస్వామి కూతురు రాజ్యం, నువ్వు వచ్చీ పోయేటప్పుడు ఇంతేసి కండ్లు చేసుకుని చూస్తుంటుంది నీకోసమే మనింటికి అప్పుడప్పుడు నన్ను చూసే నెపంపై వస్తూంటుంది. దానిని నువ్వు కట్టుకో – సుఖపడు".

"ఏంటీ నీమాటలు! విడ్డూరంగ, వికృతంగ ఉన్నాయి. నువ్వు చచ్చిపోతే నేనూ నీతోనే చచ్చిపోతానే", అని చేతుల్లో ముఖం దాచుకుని మౌనంగ రోదించడం మొదలెట్టేడు.

అప్పుడు చూచేడు భీమారావు, నారాయుడి ఎడం చేతి నాల్గు వేళ్ళు చచ్చు పడుండడం. బహుశా అవి జూటు ప్రెస్సులో నలిగి పోయుండొచ్చు.

"ఎందుకయ్యా నారాయా నీకు నా మీదింత ప్రేమ?" అని మల్లమ్మ మెల్లగ వంగి నారాయుడి తలను తన గుండెకు హత్తుకుని కన్నీరు కార్చ నారంభించింది.

భీమారావు అడుగు ముందుకు పడడం లేదు.

చిన్న చప్పుడు విని గదిలోని మరో పక్కకు భీమారావు చూచేడు. అక్కడ ఓ నాలుగేళ్ళ పిల్లడు బొమ్మలతో ఆడుకుంటున్నాడు. వాడిని చూడగానే భీమారావు గతుక్కుమన్నాడు. వాడు అచ్చు తన భార్య మల్లమ్మ కాపురాని కొచ్చినప్పుడుండే రూపాన్ని పుణికి పుచ్చుకున్నాడు. అవేకళ్ళు, అవే చంపలు, అదే శరీర కాంతి!

ఈ ఏడుపులు రొదలు, ఈ క్రోధాలు కావేషాలు వేటితో సంబంధం లేకుండ ఉల్లాసంగ ఆ బొమ్మల ప్రపంచంలో విహరిస్తున్నాడు ఆ పిల్లడు.

భీమారావు హృదయంలో ముల్లుగుచ్చుకున్న ట్లయింది. ఏదో అనిర్వచనీయమైన బాధతో హృదయం మూల్గింది. తను ఆ వాత్సల్యాన్ని, ఆ నిస్వార్థ ప్రేమాను రాగాలను యెరుగడు. తను దురదృష్ట వంతుడు. చేజేతులా తను చేసుకున్న కర్మ అది!

'నీకే జబ్బులేదే. భీమన్నకు మన ఆచూకి తెలిసి పోతే వచ్చి మనల్ని చంపేస్తాడన్న భయంతోనే కృంగి ఈ కష్టాన్ని తెచ్చుకున్నావు. చంపుతే చంపనీయే– ఒక సారే ముగ్గురం చచ్చిపోదాం. ఇలా భయంతో రోజు చచ్చేకన్న అదేనయం కాదే?"

నారాయుడి మాటలతో భీమారావు మళ్ళీ ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు. ఆ పిల్లడి నుండి దృష్టిని మరల్చి ఇటు చూచేడు. నారాయుడు అందించిన మందును గోడకు జేరగిల పడి మల్లమ్మ త్రాగుతుంది.

భీమారావు మరి ఆవేశాన్ని ఆపుకో లేక పోయేడు. తలుపుల్ని త్రోసుకుని గదిలోకి ప్రవేశించేడు. నారాయుడు, మల్లమ్మ అతడిని చూచి భయంతో బిగుసుకు పోయేరు

నారాయుడు ముందు తేరుకుని – బీమన్నా' నన్ను చంపు మల్లమ్మ దేమి తప్పులేదు నేను మీ ఇద్దర్ని మోసగించి ఆమెను తెచ్చా'. అని వణుకుతున్న స్వరంతో అన్నాడు

ఇ·వేమన·పద్యాలు

కోరిన కోరికలెల్లను
మేలిమిగా జరుగునటర మెచ్చరు భువిలో
కారణ కర్మ ప్రకారము
కోరిన కోరికెలు జరుగు గొబ్బున వేమా.

ఈ లోగా మల్లమ్మ కాస్త ధైర్యాన్ని తెచ్చుకుని – 'భీమయ్యా! ముందునన్ను పొడిచి చంపు. నారాయుడి దేమి తప్పులేదు. వాడు అమాయకుడు. నేనే వాడ్ని నావలలో వేసి ఇక్కడకు తీసుకొచ్చా. వాడ్ని, నాకొడుకుని ఏమి చేయకు. నన్ను చంపి, నీ కక్ష తీర్చుకో", అని వేడుకుంది.

ఆ ఇద్దరు భీమారావు చేతిలోని అపదును కత్తిని చూచి వణికి పోతూన్నారు భీమారావు చేతిలోని కత్తిని దీర్ఘంగ ఓసారి చూచి దానిని గదిలో ఓ మూలకు విసరి వేసేడు ఆ బాలుడి దగ్గరకు వెళ్ళి, వాడ్ని ఎత్తుకుని ముద్దాడి క్రిందకు దించేసేడు జేబులోని పర్సును తీసి అందులో పద్దెనిమిది వంద రూపాయల నోట్లుంటే, ఓ రెండింటిని మాత్రం తీసి తన జేబులో పెట్టుకుని, మిగతా పదహారు వందల రూపాయలతో నున్న ఆ పర్సును నారాయుడి వడిలోకి విసరి–

'మల్లమ్మకు సరైన వైద్యం చేయించు. బాబుకి మంచి బట్టల్ని కొను." అని చెప్పేసి చటుక్కున వెనుదిరిగి వచ్చేసేడు.

మల్లమ్మ, నారాయుడు కృతజ్ఞతలను చెప్పు కుందికైన నోట మాట రాక దిగ్భ్రాంతులై అలా ఉండి పోయేరు ఆ రాత్రి లాడ్జిలో భీమారావు ఇన్నాళ్ళకు విస్కీ సహాయం లేకుండా ప్రశాంతంగ నిద్ర పోగల్గేడు □